

విద్యారంభం..అయోమయం
నేటి నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. ప్రభుత్వ పాఠశాలలు సమస్యలతో విద్యార్థులకు స్వాగతం పలుకుతున్నాయి. - 8లో..



రైతులు రోడ్డెక్కితేనే సమస్యల పరిష్కారం
రైతులు రోడ్డెక్కితేనే సమస్యలు పరిష్కారం అవుతాయని సంయుక్త కిసాన్ మోర్చ రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
41 /28

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు. ఉక్కపోతగా ఉంటుంది.



జగన్‌ను చూసి రైతుల అభివాదం



చెట్టెక్కిన అభిమానం



రైతులకు, ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



పోరుబాటకు హాజరైన జనసందోహంలో ఓ భాగం

ఉప్పెనలా కదిలి..
గర్జించిన పొదిలి!

పొగాకు రైతుల కష్టాలను స్వయంగా తెలుసుకొని, వారికి అండగా ఉండి కొండంత ధైర్యాన్ని నింపేందుకు పొదిలికి మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాకతో పట్టణం జనదుర్గంగా మారిపోయింది. ఉమ్మడి జిల్లాలోని పలు నియోజకవర్గాల నుంచి నుంచి వేలాదిగా రైతులు, ప్రజలు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావడంతో రహదారులన్నీ కిక్కిరిసిపోయాయి. పొగాకు రైతులకు అండగా ఉంటాం.. ప్రభుత్వం ఆదుకునేంత వరకూ పోరాటం సాగిస్తామంటూ జగన్ చేసిన ప్రకటనకు మద్దతుగా జనం గర్జించారు. రైతులకు మద్దతుగా, ప్రభుత్వానికి వ్యతిరేకంగా జగన్ మాటలు తూటాల్లా పేలాయి. ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత స్పష్టంగా కనిపించింది.

- పొగాకు రైతుకు మద్దతుగా గర్జించిన పశ్చిమ ప్రకాశం
- కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు
- జగన్ వెంట సైన్యంలా కదిలిన రైతులు, అభిమానులు
- కూటమి ప్రభుత్వంపై వ్యతిరేక నినాదాలతో గర్జించిన పృథులాపురి
- జై జగన్, నినాదాలతో హోరెత్తిన పట్టణం
- భగభగ మండే సూర్యుడిని సైతం లెక్కచేయకుండా జనహోరు



వైఎస్ జగన్‌కు శాలువా కప్పుతున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మ



వైఎస్ జగన్‌కు స్వాగతం పలుకుతున్న మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు



అభిమాన జనసందోహంతో కిక్కిరిసిన పొదిలి

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

పొగాకు రైతులకు అండగా...పోరుబాట కార్యక్రమానికి తమ అభిమాన నాయకుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వస్తున్నారని తెలుసుకున్న ప్రజలు స్వచ్ఛందంగా తండోప తండాలుగా పొదిలి పట్టణానికి తరలివచ్చారు. పొదిలి-దర్శి రోడ్డులో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ నుంచి రెండు కిలో మీటర్ల దూరం పొదిలి పట్టణంలో ఉన్న పొగాకు వేలం కేంద్రానికి కిక్కిరిసిన జన సందోహాన్ని దాటి రావటానికి గంటన్నర సమయం పట్టింది. భగభగ మండుతున్న సూర్యుని తాపాన్ని సైతం లెక్కచేయకుండా రైతులు, అభిమానులు, పార్టీ కార్యకర్తలు ఉప్పెనలా కదిలి వచ్చారు. జగన్‌ను చూసేందుకు, కరచాలనం చేసేందుకు ఎగబడ్డారు. జై జగన్ నినాదాలతో పొదిలి పట్టణం మారుమోగిపోయింది. జై జగన్ నినాదాలతో పాటు సీఎం...సీఎం..సీఎం అంటూ నినాదాలు చేశారు. అడుగడుగునా వైఎస్ జగన్ జనాలకు నమస్కరించుకుంటూ ముందుకు సాగారు. వైఎస్ జగన్ వచ్చినప్పటి నుంచి తిరిగి వెళ్లే వరకు జనాల్లో అదే ఊపు తొణికిసలాడింది.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు..


వైఎస్ జగన్ పొగాకు రైతుకు అండగా పోరుబాట కార్యక్రమానికి వచ్చిన సందర్భంగా ఆయన అభిమానులు కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చంద్రబాబు పాలన అత్యంత దారుణంగా ఉందని, తిరిగి మళ్లీ వైఎస్ జగన్ ముఖ్యమంత్రి కావాలంటూ నినాదాలు చేశారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేదని, అన్ని పంటలు నష్టాలతోనే సాగుచేస్తున్నామంటూ వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లారు. మహిళలకు భద్రత లేదంటూ కూడా ప్రజలు చేసిన నినాదాలు హోరెత్తాయి.

పచ్చమూకల దాడితో పార్టీ శ్రేణుల సంయమనం..

పొగాకు రైతుల బాధలు స్వయంగా తెలుసుకునేందుకు వచ్చిన జగన్ మోహన్‌రెడ్డి పోరుబాట కార్యక్రమాన్ని భగ్నం చేసేందుకు పచ్చమూకలు యత్నించాయి. పొగాకు బోర్డు వద్దకు వెళ్తున్న సమయంలో కొందరు మహిళలు ఓ టీడీపీ నేత ఇంటివద్ద నిరసన తెలిపి రాళ్లు విసిరారు. ఒకరిద్దరు రైతులతో పాటు, పోలీసులు గాయపడ్డారు. వేలాదిగా అభిమానులు రోడ్డుకు ఇరువైపులా జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిచారు. పార్టీ నాయకులు పలువురు సంయమనం పాటించాలంటూ వారికి సైగలు చేయడంతో అభిమానులు శాంతించారు. టీడీపీ శ్రేణులు జగన్‌పై దాడికి యత్నించి విఫలమైన చోట భారీగా పోలీసులు ఉండటంతో జగన్ నవ్వుకుంటూ అభివాదం చేసుకుంటూ ముందుకు వెళ్లారు.

వేలం కేంద్రంలో గోడు వెళ్లబోసుకున్న రైతులు...

మధ్యాహ్నం సరిగ్గా 12 గంటలకు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పొదిలి వేలం కేంద్రంలోకి అడుగు పెట్టారు. ముందుగా ఆయన వేలం కేంద్రం అధికారులతో మాట్లాడారు. లోనికి ప్రవేశించిన ఆయనకు పొగాకు రైతులు వేలం కేంద్రం అధికారులు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. అనంతరం రైతులతో స్వయంగా వైఎస్ జగన్ మాట్లాడారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి జిల్లాలో రైతులు పడుతున్న కష్టాలను ఆయనకు పూసగుచ్చినట్లు చెప్పారు. బుధవారం పొగాకు వేలం కేంద్రానికి రామాపురం, గురువుపాడు, మంగాపురం, కొలకట్ల, నేకునాంబాదు, జేబీకే పురం, సలకలవీడు గ్రామాలకు చెందిన రైతులు పొగాకు బేళ్లను వేలానికి తీసుకొచ్చారు. దాదాపు 208 మంది రైతులు 700 బేళ్ల తీసుకొచ్చారు. ఆయా గ్రామాల రైతులు వైఎస్ జగన్‌కు పొగాకు పంట వల్ల ఈ ఏడాది బ్యారన్‌కు రూ.5 లక్షలు నష్టపోతున్నామని చెప్పారు. గత సంవత్సరం పొగాకు పొడి అమ్మితే క్వింటాకు రూ.14,200 వచ్చిందని చెప్పారు. టీడీపీ కూటమి ప్రభుత్వంలో ధరలు పడిపోయాయని వాపోయారు. కౌలు, కూలీల ధరలు, మందుల ధరలు అమాంతం పెరిగిపోయాయని వెల్లడించారు. మీ ప్రభుత్వంలో మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి కొనుగోలు చేయించటం వలన వ్యాపారులు పోటీపడి మరీ పొగాకును కొనుగోలు చేశారని చెప్పారు.



కార్యక్రమంలో వైఎస్ జగన్‌తో పాటు రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ ఒంగోలు రీజినల్ కోఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జ్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ ప్రోగ్రాం కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు, వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు, కొండపి నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు, మాజీ మంత్రులు మేరుగు నాగార్జున, ఆదిమూలపు సురేష్, మార్కాపురం, గిద్దలూరు, కందుకూరు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్‌లు, మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, కేపీ నాగార్జునరెడ్డి, బుర్రా మధుసూదన్ యాదవ్, కనిగిరి, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు దద్దాల నారాయణ యాదవ్, చుండూరి రవిబాబు, ఒంగోలు పార్లమెంట్ పార్టీ పరిశీలకుడు బత్తుల బ్రహ్మనందరెడ్డి, నెల్లూరు పార్లమెంట్ పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకర్‌రావు, పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి, రెడ్డి కార్పొరేషన్ మాజీ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ షేక్ షంషీర్ అలీ బేగ్, పీడీసీసీబీ మాజీ చైర్మన్‌లు వైఎం ప్రసాద్ రెడ్డి, డాక్టర్ వెంకయ్య, జెడ్పీటీసీల సంఘ జిల్లా అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి, ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, కనిగిరి జెడ్పీటీసీ, మండల పార్టీ అధ్యక్షుడు మడతల కస్తూరిరెడ్డి, కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, పార్టీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తుల అశోక్ కుమార్ రెడ్డి, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు గంగసాని హుస్సేన్‌రెడ్డి, ఆవుల శ్రీధర్ రెడ్డి, సీఆర్‌ఐ మురళి, మసనం వెంకటరావు, పిన్నిక శ్రీనివాసులు, బచ్చల కోటేశ్వరరావు, ఇనకొల్లు సుబ్బారెడ్డి, దుద్దుకుంట మల్లికార్జున రెడ్డి, చింతపల్లి హరిబాబు, లంకపోతు అంజిరెడ్డి, మన్నే శ్రీనివాసరావు, దుంపా చెంచిరెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దాకా పిచ్చిరెడ్డి, రైతు విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ తానికొండ రామచంద్రరావు, వైపాలెం నియోజకవర్గానికి చెందిన పార్టీ నాయకులు ఒంగోలు మూర్తిరెడ్డి, షేక్ అబ్దుల్ మజీద్, ఆళ్ల ఆంజనేయ రెడ్డి, యేర్వ చలమారెడ్డి, గంటా రమణారెడ్డి, ఏకుల ముసలారెడ్డి, మార్కాపురం నియోజకవర్గ నాయకులు వెన్నా హనుమారెడ్డి, వై వెంకటేశ్వరరావు, కేవీ రమణారెడ్డి, గుంటక వనజాక్షి చెన్నారెడ్డి, గొలమారి శ్రీనివాస్ రెడ్డి, ఉత్తమ్ కుమార్, దర్శి నియోజకవర్గ నాయకులు మేడికొండ జయంతి, కుమ్మిత అంజిరెడ్డి, గుంటు పోలయ్య, గిద్దలూరు నియోజకవర్గ నాయకులు వేగినాటి ఓసురా రెడ్డి, చెన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



వేలం అధికారులతో మాట్లాడుతున్న జగన్, పక్కన చెవిరెడ్డి, బూచేపల్లి, తాటిపర్తి, దద్దాల, ఆదిమూలపు, కేపీ, అన్నా



పొగాకు రైతులతో మాట్లాడుతున్న వైఎస్ జగన్ పక్కన వైవీ సుబ్బారెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

రైతులకు కృతజ్ఞతలు:

పోరుబాట కార్యక్రమానికి ఉమ్మడి ప్రకాశం జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన రైతులకు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు పార్టీ ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. పొగాకు రైతులకు న్యాయం జరిగే వరకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని, ప్రభుత్వం దిగి వచ్చే వరకు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ఆందోళనలు చేపడతామన్నారు.



అభిమాన సంబరం



కంచెలు దాటిన అభిమానం..



జగన్‌ను చూసి జనం కేరింత



బస్సుపైకెక్కి..జగన్‌కు అభివాదం చేస్తున్న యువకులు



మహిళోత్సాహం..

రైతులు లేకుండానే వేలం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొదిలి పొగాకు వేలం కేంద్రానికి వస్తున్నారని కూటమి ప్రభుత్వ పెద్దలు, పొగాకు బోర్డు అధికారులు రైతుల పట్ల నిరంకుశంగా వ్యవహరించారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన వేలంలో రైతులు పాల్గొనకుండా బలవంతంగా బయటకు పంపించారు. ప్రతి రోజూ వేలానికి కేంద్రం లోపలకు అనుమతిస్తున్నారని, ఈ రోజే ఎందుకు అనుమతించడం లేదని రైతులు నిలదీశారు. రోజూ మాదిరే వేలం నిర్వహించాలని కోరగా, వేలం కేంద్రం అధికారి గిరిరాజ కుమార్, పొగాకు బోర్డు ఒంగోలు ఆర్ఎం లక్ష్మణరావు పెడచెవిన పెట్టి ఏకపక్షంగా ధర నిర్ణయించేశారు.



పెద్దారవీడు: రైతులు, నాయకులతో ర్యాలీగా వెళ్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

గిట్టుబాటు ధర కల్పించడంలో విఫలం

పెద్దారవీడు: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ధ్వజమెత్తారు. బుధవారం మండలంలోని దేవరాజుగట్టులో రైతులు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించక పోవడంతో పెట్టుబడికి తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో అర్థంగాక అప్పుల్లో కూరుకుపోయి రైతులు తీవ్రంగా ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నారని చెప్పారు. ప్రస్తుతం గ్రామాల్లో రైతులు ఆర్థికంగా అధోగతి పాలవుతున్నారని, దిక్కుతోచని పరిస్థితి నెలకొందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా నేటికీ రైతులకు ఇచ్చిన హామీలు ఒకటి కూడా నేరవేర్చలేదన్నారు. కూటమి పాలనలో నిరుద్యోగులు, యువకులు, మహిళలు, రైతులు, అన్ని వర్గాల ప్రజలను మోసం చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పాలనా వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే సీఎం చంద్రబాబునాయుడు రాష్ట్రంలో డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారని ఎద్దేవా చేశారు. మహిళలపై దురాగతాలు తారస్థాయికి చేరుకున్నాయని, దాడులు జరుగుతున్నా కూటమి పాలకులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పత్రిక స్వేచ్ఛను హరిస్తూ సాక్షి మీడియా సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావుపై అక్రమ కేసు బనాయించి అరెస్టు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. అనంతరం పొదిలిలో నిర్వహించే జగనన్న పోరుబాట కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే తాటిపర్తి బయల్దేరారు.

పార్టీ మండల కన్వీనర్ పోలిరెడ్డి కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ ఏర్వ చలమారెడ్డి, సర్పంచ్‌లు అంగిరేకుల ఆదినారాయణ, మూల రమణారెడ్డి, గుద్దెపోడు రమేష్, నాయకులు గుండారెడ్డి వెంకటేశ్వర రెడ్డి, బట్టగిరి రమణారెడ్డి, వెన్నా శివకృష్ణారెడ్డి, దుద్దెల వెంకటరెడ్డి, జైనుల్లావుద్దీన్, ఏలూరి వెంకటనారాయణరెడ్డి, తోకల ఆవులయ్య, గుంటూ దానమయ్య, గాదం శ్రీనివాసులు, ఏర్వ శేషసేనా రెడ్డి, నాగరాజు, సర్పంచులు, ఎంపీటీసీలు, రైతులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా మదనవేణుగోపాలుని రథోత్సవం


భక్తజనుల మధ్య సాగుతున్న రథోత్సవం

పామూరు: మదన వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రుక్మిణి, సత్యభామా సమేత మదనవేణుగోపాలస్వామి రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. రథోత్సవాన్ని ఎండోమెంట్ డీసీ పి.శ్రీనివాసరెడ్డి, ఈఓ శ్రీగిరిరాజు నరసింహ బాబు, ఎంపీపీ గంగసాని లక్ష్మి, పువ్వాడి వెంకటేశ్వర్లు, రెడ్డిసంక్షేమసంఘం నాయకులు బైరెడ్డి జయరామిరెడ్డి, బోయళ్ల నారాయణరెడ్డిలు ప్రారంభించారు. రతోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన కళారాలు, కేరళ వాయిద్యాలు, కోలాటం, భజన కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సీఐ ఎం భీమానాయక్ ఆధ్వర్యంలో ఎస్సైలు పామూరు టి.కిషోర్‌బాబు, సీఎస్‌పురం ఎం వెంకటేశ్వరనాయక్, వెలిగండ్ల క్రిష్ణపావని, సిబ్బంది ప్రత్యేక భద్రతా ఏర్పాట్లుచేశారు.


విశిష్ట అలంకరణలో ఉత్సవమూర్తులు

పామూరులో మొట్టమొదటిసారిగా రథోత్సవం నిర్వహించడంతో భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

ఏరువాక పౌర్ణమి ప్రారంభం

ఒంగోలు సబర్బన్: ఏరువాక పౌర్ణమి కార్యక్రమాన్ని మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా బాల వీరాంజనేయ స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా ప్రారంభించారు. త్రోవగుంట పొగాకు వేలం కేంద్రంతో పాటు, సమీపంలోని కార్యక్రమాన్ని పొలాల్లో నిర్వహించారు. తొలుత పొగాకు వేలం కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్, వ్యవసాయ శాఖాధికారి శ్రీనివాసరావు, ఇతర విభాగాలఅధికారులు పాల్గొన్నారు.

● చెదిరిందయ్యా చంద్రం

విద్యారంభం అయోమయం!

- నేటి నుంచి పాఠశాలల పునఃప్రారంభం
- సర్కారు నిర్వాకంతో ఇప్పటికీ పూర్తి కాని టీచర్ల బదిలీల ప్రక్రియ
- పాఠశాలకు పూర్తి స్థాయిలో అందని స్టూడెంట్ కిట్లు
- నాడు–నేడు మిగులు పనులు ఏడాదిగా నిలిపివేత
- కళావిహీనంగా ప్రభుత్వ పాఠశాలలు
- మౌలిక వసతులపై దృష్టి సారించని వైనం
- తల్లికి వందనం పథకంపై స్పష్టత కరువు

ఒంగోలు సిటీ:

సమాజంలో పేదరికాన్ని రూపుమాపాలంటే విద్యతోనే సాధ్యమని జ్యోతిబా పూలే, బీఆర్ అంబేడ్కర్ లాంటి మహామహులు మొదలు ఎందరో విద్యావేత్తలు పేర్కొన్నారు. విద్య, వైద్యం పేదలకు ఉచితంగా అందిస్తే ఆర్థిక అసమానతలు తొలగించేందుకు అవకాశముంటుందన్నది జగమెరిగిన సత్యం. ఇందుకు ప్రభుత్వాల తోడ్పాటు తప్పనిసరి. కానీ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సర్కారు విద్యావ్యవస్థను క్రమంగా చిదిమేసే చర్యలకు పూనుకుంది. పేద, మధ్య తరగతి విద్యార్థులకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కల్పించిన వసతులను, అందించిన పథకాలను దూరం చేసి పరోక్షంగా ప్రైవేట్ వైపు మొగ్గు చూపే ఎత్తుగడలు వేస్తోంది. వేసవి సెలవులు ముగిసి పాఠశాలలు పునఃప్రారంభమవుతున్న సమయానికి విద్యార్థులకు అందించాల్సిన పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, డిక్షనరీలు, యూనిఫాంలు, బెల్టులు, బ్యాగులు, షూస్ తదితర సామగ్రిని ఇప్పటికీ పూర్తిస్థాయిలో సరఫరా చేయలేదు. జిల్లాలోని 38 మండలాల్లో విద్యా వనరుల కేంద్రాలకు రాష్ట్ర ప్రభుత్వం గత నెల నుంచి పాఠ్య పుస్తకాలు సరఫరా చేయడం ప్రారంభించింది. తొలివిడతలతో కొంత సామగ్రిని పంపగా, మిగిలినవి రెండో విడతలో వస్తాయని ఎంఈఓలు చెప్పుకొచ్చారు. కానీ నేటికీ పుస్తకాలతో సహా సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా కిట్‌లోని సామగ్రి పాఠశాలలకు చేరలేదు.

తల్లికి వందనంపై స్పష్టత ఏది?

జిల్లా వ్యాప్తంగా 3,098 పాఠశాలల్లో 2,28,973 మంది విద్యార్థులు నమోదై ఉన్నారు. అధికారంలోకి రాగానే తల్లికి వందనం పథకం కింద ఇంట్లో ఎంత మంది ఉంటే అంత మందికి రూ.15 వేల చొప్పున ఇస్తామని ఊదరగొట్టిన కూటమి నాయకులు తొలి ఏడాది మొండిచేయి చూపారు. దీంతో జిల్లాలోని విద్యార్థులు దాదాపు 340 కోట్ల రూపాయల మేర లబ్ధి కోల్పోయారు. ఈ ఏడాది జిల్లాలోని విద్యార్థుల సంఖ్య ప్రకారం తల్లుల ఖాతాల్లో 343.46 కోట్ల రూపాయలు జమ చేయాల్సి ఉంది. పాఠశాలల పునఃప్రారంభం రోజున తల్లికి వందనం పథకం అమలు చేస్తామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి మార్గదర్శకాలు విడుదల చేయలేదు. దీంతో లబ్ధిదారుల జాబితాలో తమ పేరు ఉంటుందో.. ఎగిరిపోతుందో తెలియక తల్లిదండ్రులు సతమతమవుతున్నారు. లబ్ధిదారుల జాబితాను ముందుగా ప్రకటించకపోవడం, అర్హత ఉండి జాబితాలో పేరు లేకపోతే మళ్లీ దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించడం లాంటివి ఏవీ లేకుండానే పథకం నేరుగా అమలు చేస్తామని చెప్పడంపై తల్లిదండ్రులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

టీచర్ల బదిలీల్లో గందరగోళం

ప్రభుత్వ పాఠశాలకు 49 రోజులపాటు వేసవి సెలవులు వచ్చాయి. ఈలోపే ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ పూర్తి చేసి పాఠశాలలు తెరిచే సమయానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాల్సిన ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టడంలో ఘోరంగా విఫలమైంది. ఎస్జీటీల బదిలీలను మాన్యువల్ పద్ధతిలో చేపడతామని చెప్పిన సర్కారు.. అంతలోనే మాట మార్చి వెబ్ కౌన్సెలింగ్‌కు పిలిచింది. దీంతో ఉపాధ్యాయులు ఎక్కడికక్కడ రోడ్డెక్కి ఆందోళనలు చేపట్టడంతో ప్రభుత్వం దిగిరాక తప్పలేదు. పాఠశాలలు ప్రారంభిస్తున్న సమయంలోనే ఉపాధ్యాయులు కౌన్సెలింగ్‌కు హాజరు కావాల్సి ఉండటంతో మరో పది రోజుల వరకు తరగతుల నిర్వహణ గందరగోళంగా మారే అవకాశం ఉందని విద్యావేత్తలు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా బదిలీల కౌన్సెలింగ్ విషయంలో ఉపాధ్యాయ సంఘాల మధ్య విభేదాలు భగ్గుమనడం, ప్రభుత్వ పాఠశాలల నిర్వహణపై సర్కారు అలసత్వం చూపుతుండటంతో పిల్లలను పంపాలా వద్దా అని తల్లిదండ్రులు ఆలోచిస్తున్నారు.


కనిగిరి నాలుగో వార్డు ఉర్దూ పాఠశాలలో ఏడాది క్రితం నిలిచిపోయిన తరగతి గదుల నిర్మాణ పనులు

నాడు నేడుకు మంగళం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో సరికొత్త సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దేందుకు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. జిల్లాలో మన బడి నాడు–నేడు కింద తొలివిడత 1015 పాఠశాలలను ఎంపిక చేసి రూ.229.61 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో 7,431 పనులు పూర్తి చేశారు. తరగతి గదుల నిర్మాణం, ఆధునికీకరణ, ఫర్నిచర్, గ్రీన్ చాక్‌బోర్డులు, ల్యాబ్‌లు, వాటర్‌ప్లాంట్లు, ప్రహరీ, మరుగుదొడ్ల నిర్మాణం, మరమ్మతులు, విద్యుదీకరణ ఇలా అన్ని రకాల వసతులు కల్పించి కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా చేశారు. నాడు–నేడు రెండో దశలో 979 పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపిక చేసి రూ.417.31 కోట్ల నిధులు కేటాయించారు. మరుగుదొడ్లు, విద్యుదీకరణ, వంట గదుల నిర్మాణం, తరగతి గదుల మరమ్మతులు పూర్తి చేశారు. అయితే జిల్లాలోని 80 పాఠశాలల్లో 71 భవన నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఏడాది కాలంగా ఈ పనులు నిలిచిపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

దప్పిక తీరే దారేది?

జిల్లాలో అధిక శాతం పాఠశాలల్లో వాటర్ ప్లాంట్లు మొరాయించాయి. గత విద్యా సంవత్సరంలోనే మరమ్మతులకు గురైన ఆర్వో ప్లాంట్లను బాగు చేయించకుండా వదిలేశారు. వేసవి సెలవుల్లో మరమ్మతులు పూర్తి చేసే అవకాశం ఉన్నా ప్రభుత్వం గాలి కొదిలేసింది. దీంతో విద్యార్థులకు ఈ ఏడాది తొలి నుంచే తాగునీటి కష్టాలు తప్పడం లేదు.

ఇండెంట్ ఇలా.. చదువు సాగేదెలా?



జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు 3,098	నోట్ పుస్తకాలు వచ్చింది 9,87,558 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఇవ్వాల్సింది 15,04,680	పాఠ్యపుస్తకాలు వచ్చింది 8,65,226 రావాల్సింది 12,69,884	బెల్టులు వచ్చింది 1,28,837 ఇంకా రావాల్సింది 52,575
మొత్తం విద్యార్థుల సంఖ్య 2,28,973			
సర్వేపల్లి రాధాకృష్ణన్ కిట్‌కు ఇండెంట్ పెట్టింది 1,81,412 మందికే..	బ్యాగులు వచ్చింది 42,119 ఇంకా రావాల్సింది 1,39,293	నిఘంటువులు వచ్చింది 1,16,595 ఇంకా రావాల్సింది 65,293	ఏకరూప దుస్తులు వచ్చింది 1,18,130 రావాల్సింది 362824

రైతులు రోడ్డెక్కితేనే సమస్యల పరిష్కారం

- ఏరువాక పౌర్ణమి రైతు సదస్సులో మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

ఒంగోలు టౌన్: రైతులు రోడ్డెక్కి పోరాటాలకు దిగినప్పుడే సుదీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం అవుతాయని సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్, మాజీ వ్యవసాయ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. స్థానిక మల్లయ్య లింగం భవనంలో బుధవారం ఏరువాక పౌర్ణమి రైతు సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ ఎలాంటి సమస్యనైనా పోరాటాల ద్వారా మాత్రమే పరిష్కారమవుతాయన్నారు. ఉత్తర భారత దేశంలోని రైతుల్లో ఉన్న ఐక్యత ఆంధ్రప్రదేశ్‌లో లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను కులాలు, మతాలు, రాజకీయాల పేరుతో పాలకులు విడదీసి పాలన చేస్తున్నారని విమర్శించారు. రైతు నాయకుల పేరుతో కొందరు బ్రోకర్లు కార్పొరేట్ శక్తులకు తొత్తులుగా మారి రైతులను నిలువునా ముంచుతున్నారని మండిపడ్డారు. డబుల్ ఇంజిన్ సర్కారు పాలనలో రైతన్నల పట్ల అంతులేని నిర్లక్ష్యం కనిపిస్తుందన్నారు. ప్రధాని మోడీ మాటలకు, చేతలకు పొంతన లేదని, ఢిల్లీ రైతాంగ ఉద్యమం సమయంలో రైతులకు లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీని అమలు చేయకుండా దగా చేశారని ధ్వజమెత్తారు. విదేశాల్లో పరిశ్రమలకు ఎంతగా ప్రాధాన్యత ఇస్తారో వ్యవసాయానికి కూడా అంతే ప్రాధాన్యత ఇస్తారని చెప్పారు. దేశంలో రైతులకు గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు మాట్లాడుతూ డబుల్ ఇంజిన్ సర్కార్ పాలనలో ఏ పంటకు కూడా గిట్టుబాటు ధరలేదని, పొగాకు, మిర్చి, శనగ, వరి, కంది, పత్తి పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని చెప్పారు. సులభతర వాణిజ్యం చేసుకునేందుకు కార్పొరేట్ శక్తులను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వాలు దేశానికి పట్టెడన్నం పెట్టే రైతులకు సులభంగా వ్యవసాయం చేసుకునేందుకు ఎందుకు సహకరించడం లేదో చెప్పాలని ప్రశ్నించారు. వేలకోట్ల బ్యాంకు రుణాలను ఎగ్గొట్టి దేశం విడిచిపోతున్న కార్పొరేట్లపై ఉన్న ప్రేమ రైతులపై ఎందుకు లేదో చెప్పాలన్నారు. దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్నారని ఆరోపించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వడ్డే హనుమారెడ్డి మాట్లాడుతూ పంటల బీమా పథకం రైతాంగ సొమ్మును బీమా కంపెనీలకు దోచిపెట్టడానికి తప్ప రైతులకు ఏమాత్రం ఉపయోగపడడం లేదన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం విశ్రాంత ప్రొఫెసర్ నాగమోతు వేణుగోపాలరావు, కోటేశ్వరరావు, పెండ్యాల హనుమంతరావు, కోడూరి నాంచారులు, కె.వీరారెడ్డి, బీమవరపు సుబ్బారావు, చుంచు శేషయ్య, జుజ్జూరి జయంతి బాబు, చావలి సుధాకర్, ఏంఎ సాలార్, ఉప్పుటూరి ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు

సత్తా చాటిన కృష్ణా జిల్లా ఎడ్లు


హోరాహోరీగా సాగుతున్న రాధాడు పోటీలు

సింగరాయకొండ: పాతసింగరాయకొండ వరాహా లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాష్ట్రస్థాయి రాధాడు పోటీలు నిర్వహించారు. పోటీల్లో 12 జతల ఎడ్లు పాల్గొనగా కృష్ణా జిల్లా కోడూరు మండలం విశ్వనాథపల్లి గ్రామానికి ఎలిసెట్టి ఉమామహేశ్వరి, యనమలకుదురు గ్రామం వెలగపూడి కిరణ్ ఎడ్లు రూ.50 వేలు గెలుచుకున్నాయి. ద్వితీయ బహుమతి రూ.40 వేలను బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం పగడవారిపాలెం గ్రామానికిచెందిన కుంచాల వేదశ్రీలతారెడ్డి ఎడ్లు, తృతీయ బహుమతి రూ.30 వేలను బాపట్ల జిల్లా చినగంజాం మండలం కడవకదురు గ్రామానికి చెందిన కొక్కు మహేశ్వర్‌రెడ్డి ఎడ్లు సాధించాయి.

స్కూలు, కాలేజీ బస్సులు ఫిట్‌నెస్

- జిల్లా ఉపరవాణా కమిషనర్ ఆర్.సుశీల

ఒంగోలు సబర్బన్: స్కూల్, కాలేజీలు పునః ప్రారంభం సందర్భంగా విద్యార్థులను చేరవేసే బస్సులకు ఫిట్నెస్ సర్టిఫికెట్ చేయించుకోవాలని జిల్లా ఉప రవాణా కమిషనర్ ఆర్.సుశీల సూచించారు. ఈ నెల 12వ తేదీ నుంచి పాఠశాలలు, కళాశాలలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో వెంటనే ఫిట్నెస్ సర్టిఫికెట్ (ఎఫ్‌సీ)ను రెన్యువల్ చేయించుకోవాల్సిందిగా కోరారు. అలాగే ప్రభుత్వానికి చెల్లించాల్సిన టాక్స్‌ను వెంటనే చెల్లించాలన్నారు. పర్మిట్, ఇన్సూరెన్సు, పొల్యూషన్ సర్టిఫికెట్, వాహనం నడిపే డ్రైవర్‌కు సంబంధిత డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండి, ఐదు సంవత్సరాల అనుభవం ఉండాలన్నారు. బస్సులో ఫస్ట్ ఎయిడ్ కిట్‌ను అమర్చాలని చెప్పారు. స్కూల్ బస్సు నడిపే సమయంలో డ్రైవర్ రహదారి భద్రతా నియమాలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. 12వ తేదీ నుంచి జిల్లా అంతటా మోటార్ వాహన తనిఖీ అధికారులు ప్రత్యేక తనిఖీలు చేపట్టి ఫిట్నెస్ సర్టిఫికెట్, టాక్స్, పర్మిట్, ఇన్సూరెన్సు, పొల్యూషన్, డ్రైవింగ్ లైసెన్స్, రహదారి భద్రతా నియమాలను పాటించని స్కూలు, కాలేజీ బస్సుల వాహనాలకు అపరాధ రుసుం విధించి వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

104 వాహనాల్లో డీఈఓ పోస్టులకు ఆహ్వానం

ఒంగోలు టౌన్: జిల్లాలోని 104 సంచార వైద్య వాహనాల్లో డాటా ఎంట్రీ ఆపరేటర్లు, డ్రైవర్ల నియామకాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు 104 సేవల సర్వీస్ ప్రొవైడర్ హెచ్ఆర్ మేనేజర్ భవ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ పూర్తి చేసి కంప్యూటర్ కోర్సులు చేసిన అభ్యర్థులు డాటా ఎంట్రీ ఆపరేటర్ కోసం దరఖాస్తు చేయాలన్నారు. పదో తరగతి పాసై, హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన అభ్యర్థులు డ్రైవర్ పోస్టుల కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు బీహెచ్ఎస్పీఎల్.ఇన్.కెరీర్స్ అనే వెబ్‌సైట్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 12వ తేదీ ఉదయం 10 గంటలకు పాత రిమ్స్ ఆస్పత్రిలో జరిగే ఇంటర్వ్యూలకు ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన ఎక్సైజ్ ఈఎస్

ఒంగోలు టౌన్: ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా షేక్ అయేషా బేగం బుధవారం బాధ్యతలు చేపట్టారు. నెల్లూరు డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న ఆమెను ఇక్కడకు బదిలీ చేశారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న షేక్ ఖాజా మోహిద్దీన్‌ను హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశాలు ఇచ్చారు. ఆయన ఒంగోలు ఎక్సైజ్ ఈఎస్‌గా గత ఏడాది సెప్టెంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుంచి అధికార పార్టీకి అనుకూలంగా పనిచేస్తున్నట్లు అనేక ఆరోపణలు వచ్చాయి. అయినప్పటికీ అధికార పార్టీ సామాజిక వర్గానికి చెందిన ఒక ఎక్సైజ్ సీఐ ఆయనకు వ్యతిరేకంగా లైసెన్స్‌దారుల పేరుతో ఫిర్యాదులు చేయించడంతో ప్రభుత్వం ఆయన్ను బదిలీ చేసినట్లు ప్రచారం జరుగుతుంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతి చెందిన రామాంజనేయులు

గిద్దలూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని దిగువమెట్ట గ్రామ సమీపంలోని నల్లమల అటవీప్రాంతంలో హైవే రోడ్డులో బుధవారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. ముండ్లమూరు మండలానికి చెందిన రామాంజనేయులు(23), షేక్.బాజీ ఇద్దరూ నంద్యాల నుంచి బైక్‌పై గిద్దలూరు వైపుగా వస్తున్న సమయంలో ఎదురుగా వస్తున్న మహేంద్ర వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో రామాంజనేయులు తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. బాజీ చేతులకు, కాళ్లకు తీవ్ర గాయలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకోని ప్రమాదానికి కారణమైన మహేంద్ర వాహనం డ్రైవర్ నిశికాంత్‌ను అదుపులోనికి తీసుకుని విచారణ చేపట్టారు. రామాంజనేయులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.